ప్రజాశక్తి

సోమవారం 7 ఏప్రిల్ 2025 5

శ్రీ సత్యసాయి



పంప్‌హౌస్ వద్ద నిర్వహిస్తున్నసమ్మెలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, కార్మికులు, తదితరులు

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

వేతనాలిచ్చేవరకు సమ్మె

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

సమస్యల పరిష్కారం కోసం 'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమ్మెబాట

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం రూరల్

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలిచ్చేవరకు సమ్మె కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు చెప్పారు. బకాయి వేతనాలు, పిఎఫ్ తదితర సమస్యల పరిష్కారం కోసం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు ఆదివారంవిధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్లారు. ఈసందర్భంగా జి. ఓబులు మాట్లాడుతూ తాగునీటి పథకం కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు ఇవ్వకపోతే కార్మికుల జీవనం ఎలా గడవాలని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు, సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకుడు భవిత్, కోశాధికారి వన్నూరు స్వామి, ఉపాధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి నాగరాజు, గంగాధర్, నరేష్, రమేష్, నాగరాజుతో పాటు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు పాల్గొన్నారు.

స్వార్థపరుల కల్పవృక్షం 'పురం' మున్సిపల్ మార్కెట్

అద్దె చెల్లిస్తూ మార్కెట్ ఆవరణంలో ఎండలో వ్యాపారం చేస్తున్న ఆకు కూరల వ్యాపారులు

హిందూపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ స్వార్థపరులైన కొందరి పాలకులు, అధికారులకు కల్పవృక్షంగా మారింది. ఇక్కడ ఒక్కొక్కరికి ఒక్కో విధంగా గదులు, స్థలాలను కేటాయించారు. దీంతో పురపాలక సంఘానికి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయానికి గండి పడింది. స్థలాల కేటాయింపులో మున్సిపల్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుటూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయం కాస్త సార్థపరులైన కొందరి పాలకులు, అధికారుల జేబుల్లోకి వెళుతోంది.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే సెకెండ్ గ్రేడ్ మున్సిపాలిటీ హిందూపురం పురపాలక సంఘం. ఇక్కడ పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న కూరగాయాల మార్కెట్ శిథిలం అయిందని, గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పడగొట్టారు. అదే స్థలంలో కూరగాయాల మార్కెట్ తో పాటు వాణిజ్య సముదాయ భవనం నిర్మాణం చేశారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వ హయాంలో వాణిజ్య సముదాయ భవనాలను బహిరంగ వేలం వేశారు. అయితే వేలంలో దక్కించుకున్న వారు ఇంత వరకు పూర్తి స్థాయిలో వ్యాపారాలను ప్రారంభించ లేదు. ఇక పోతే కూరగాయల మార్కెట్ బహిరంగ వేలంలో పాలకులు, అధికారులు కలిసి ఆ సమయంలో భారీ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఏకంగా ఒక కౌన్సిలర్ కు రూ. 1.35 లక్షలు, ఇక వైస్ ఛైర్మన్లకు రూ. 3 లక్షలు, ఛైర్‌పర్సన్ కు రూ. 5లక్షలు, మున్సిపల్ అధికారులకు ఏకంగా రూ. 10 లక్షలు కూరగాయల వ్యాపారులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో తూతూ మంత్రంగా బహిరంగ వేలం నిర్వహించి గదులను అప్పగించినట్లు తెలుస్తోంది. వ్యాపారులు గదుల్లో వ్యాపారం చేయకుండా గదుల బయట వ్యాపారాలు చేస్తుండడంతో మార్కెట్ మొత్తం ఇరుకుగా మారింది. అదే సమయంలో మార్కెట్ ఆవరణంలో ఉన్నా ఖాళీ స్థలాన్ని ఆకు కూరల వ్యాపారులకు 16 చదరపు అగుడుల స్థలాన్ని కేటాయించారు. దీని కోసం ఆ సమయంలో పురపాలక సంఘానికి డిపాజిట్ చెల్లించాలన్న పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ. 30 వేల నుంచి 50వేల రూపాయల వరకు మార్కెట్ అసోసియేషన్ వారు వసూలు చేశారు. ఇందులో పురపాలక సంఘానికి రూ.5వేలు చెల్లించి, మిగిలిన డబ్బులను పాలకులు, అధికారులు వాటాలు వేసుకుని ఆరగించినట్లు ఆరోపణలున్నాయి. దీంతో పాటు వ్యాపారులు నెలకు రూ.500 వరకు అద్దెలు సైతం చెల్లిస్తున్నారు. ఇది చాలదన్నట్లు చివరకు వాణిజ్య సముదాయ భవనాలను అద్దెలకు తీసుకున్న వారు వారి సొంత ఆస్థుల తరహాలో గదులను వారికి ఇష్టం వచ్చినట్లు షెట్టర్‌లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలిసినప్పటికి మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. వాణిజ్య సముదాయ భవనాలు, కూరగాయల మార్కెట్ అండర్ గ్రౌండ్ స్థలాన్ని పూల వ్యాపారులకు దారదత్తం చేశారు. దీనికి మున్సిపల్ శాఖ అనుసరించాల్సిన కనీస నిబంధనలు సైతం అధికారులు పాటించలేదన్న ఆరోపణలు వినపిస్తున్నాయి. తొలి నుంచి కూరగాయల వ్యాపారుల నుంచి ఆకు కూరల వ్యాపారులు, పూల వ్యాపారుల వరకు కేటాయించిన స్థలాలపై ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తే పెద్ద అవినీతి బయటపడడమే కాకుండా మున్సిపాల్టీకి ఆదాయం సైతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టలని పుర ప్రజలు కోరుతున్నారు.

పురపాలిక ఆదాయానికి రూ. లక్షల్లో గండి

అనుమతులు లేకుండా అండర్ గ్రౌండ్ స్థలం అప్పగింత

గుట్టు చప్పుడు కాకుండా కేటాయింపులు

వాణిజ్య సముదాయ భవనం, కూరగాయల మార్కెట్ అండర్ గ్రౌండ్ లో ఉన్నా ఖాళీ స్థలాన్ని 99 మంది చిరు వ్యాపారులకు కేటాయించేలా 2022 వ సంవత్సరం నవంబర్ 30న జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఆ తీర్మానం అనుసరించి చిరు వ్యాపారులకు కేటాయించాలి. దీని కోసం 64 చదరపు అడుగుల స్థలానికి డిపాజిట్ రూ.5వేలు, నెలకు అద్దె రూ.750, 150 చదరపు అడుగుల స్థలానికి డిపాజిట్ రూ.7,500, నెలకు అద్దె రూ.1250 నిర్ణయించారు. అయితే ఈ స్థలాన్ని చిరు వ్యాపారులకు కాకుండా పూల వ్యాపారులకు గత సంవత్సరం జనవరి 10న గుట్టుచప్పుడు కాకుండా కేటాయించారు. లాటరీ విధానం ద్వారా 25 మంది హోల్‌సేల్ పూల వ్యాపారులకు కేటాయించడానికి ఎంపిక చేశారు. దీనికి ప్రతిఫలంగా పూల వ్యాపారులు పాలక వర్గానికి లక్షల రూపాయల్లో మాముళ్ల ఇచ్చే విధంగా రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దాదాపు 15 నెలల నుంచి ఎటువంటి డిపాజిట్, అద్దెలు చెల్లించకుండానే పూల వ్యాపారులు మున్సిపల్ మార్కెట్ అండర్ గ్రౌండ్ స్థలంలో వారి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కనీస చర్యలు సైతం తీసుకోవడం లేదు. నిర్ణయించిన అద్దె వసూలు చేస్తున్నారా.?, వసూలు చేస్తుంటే ఎవరి ఖాతాలోకి వెళుతోంది అన్నది అర్థం కావడం లేదు.

ఇది ఎంత వరకు న్యాయం

మున్సిపల్ కూరగాయాల మార్కెట్ ఆవరణంలో ఆకు కూరల వ్యాపారులు రోజుకు రూ. 300 నుంచి 500 వ్యాపారం చేస్తారు. వారితో డిపాజిట్ తో పాటు రూ. 500 వరకు నెలకు అద్దెలను మున్సిపల్ అధికారులు వసూలు చేస్తున్నారు. వీరికి కనీస సౌకర్యాలను సైతం కల్పించ లేదు. ఎండకు ఎండుతూ వ్యాపారం చేస్తుంటారు. అయితే అన్ని సౌకర్యాలను కల్పించి, ఎండ అన్నది పడకుండా అండర్ గ్రౌండ్‌లో కేటాయించి పూల వ్యాపారులు రోజుకు వేలల్లో వ్యాపారం చేస్తారు. వీరికి నెలకు రూ. 750 అద్దెలు తీసుకునే విధంగా నిర్ణయించి, ఇప్పటి వరకు వారి నుంచి ఎటువంటి అద్దెలను వసూలు చేయక పోవడంపై తీవ్ర విమర్శలు వినపిస్తున్నాయి.

అనుమతులు లేకుండా మార్కెట్ అండర్‌గ్రౌండ్‌లో పూల వ్యాపారాలు చేస్తున్న దృశ్యం

రేపు పాపిరెడ్డిపల్లికి జగన్

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

సత్యసాయి జిల్లా ధర్మవరం డివిజన్ రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం రానున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన వెలువడింది. ప్రత్యర్థుల దాడిలో పాపిరెడ్డిపల్లికి చెందిన వైసిపి నాయకులు లింగమయ్యపై గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం పాపిరెడ్డిపల్లికి వస్తున్నారు. ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైసిపి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు అందరూ జగన్ పర్యటనలో పాల్గొని విజయవంత చేయాలని వైసిపి జిల్లా నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కేతిరెడ్డి వెంకటరామి రెడ్డి కార్యాలయం వద్దకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ పర్యటనను అడ్డుకుంటాం

ఎస్సి వర్గీకరణపై స్పష్టత ఇచ్చాకె జిల్లాకు రావాలి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాదిగల దశాబ్దాల కల ఎస్సీ వర్గీకరణ అంశంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఖరి స్పష్టత ఇవ్వడం లేనందున ఈ నెల 8న జిల్లా పర్యటనను రానున్న జగన్‌ను అడ్డుకుంటామని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ ఛైర్మన్ బిసిఆర్.దాస్ ఆదివారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ తీర్మాణం జరిగి 99 శాతం నెరవేరినట్లే ఉందన్నారు. శాసనమండలిలో కూడా తీర్మాణం జరగాల్సి ఉందన్నారు. అక్కడ మెజారిటీ సభ్యులు వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్సీలు ఉన్నారని చెప్పారు. వర్గీకరణపై ఆ పార్టీ వైఖరి స్పష్టత లేదని, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. మీడియా ముఖంగా ఎస్సీ వర్గీకరణపై స్పష్టత ఇచ్చిన తరువాతనే అనంతపురం జిల్లా పర్యటనకు జగన్ రావాలన్నారు. అలా కాదని వస్తే మాదిగల సెగ జగన్‌కు తప్పదని హెచ్చరించారు.

తమిళనాడులోని మధురై నగరంలో నిర్వహిస్తున్న అఖిల భారత మహాసభలకు హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, రామిరెడ్డి, తదితరులు

సిపిఎం అఖిల భారత 24వ మహాసభల్లో జిల్లా నేతలు

అనంతపురం కలెక్టరేట్ : భారత కమ్యూనిస్టు పార్టీ మార్కిస్ట్ (సిపిఎం) అఖిల భారత 24 మహాసభలకు తమిళనాడు రాష్ట్రం మధురై మహానగరంలో నిర్వహిస్తున్న సభలకు అనంతపురం సిపిఎం నేతలు హాజరయ్యారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, కర్నూల్ జిల్లా ప్రభాకర్‌రెడ్డి, అనంతపురం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, వి.సావిత్రి, వి.రామిరెడ్డి, ఎం.క్రిష్ణమూర్తి, జిల్లా కమిటీ నాయకులు ఆర్‌వి.నాయుడు, ముత్తుజా, నగర నాయకులు వలి, ప్రకాష్, మసూద్, తదితరులు హాజరయ్యారు.

మహాసభలో కూర్చొన్న సిపిఎం నాయకులు

వాతావరణ మార్పులపై అప్రమత్తత అవసరం

జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్

ప్రజాశక్తి -అనంతపురం

కరపత్రాలు విడుదల చేస్తున్న డాక్టర్ గేయానంద్, తదితరులు

ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయనిపగటి ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతున్నాయని .ఇలాంటి పరిస్థితులలో ఎక్కువసేపు బయట గడపడం వల్ల ప్రమాదకరమని వీటి పట్ల ప్రజల్లో అప్రమత్తత అవసరమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. స్థానిక సంగమేష్ నగర్ లోని జెవివి కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడుతూ గత 120 సంవత్సరాలలో ఏ సంవత్సరం లేనంత ఉష్ణోగ్రత గత సంవత్సరం నమోదయిందని ఇది ఈ ఏడాది కూడా కొనసాగే పరిస్థితి ఉందని అన్నారు. ఇదే జరిగితే ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో వడదెబ్బ వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేశంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు హీట్ యాక్షన్ ప్లాన్‌ను తయారుచేసి అమలు చేస్తున్నాయన్నారు. మన రాష్ట్రం అలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. నగర ప్రజలు వేసవి కాలం తగ్గేవరకు అవసరమైతే తప్ప ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలన్నారు. ఈ విషయంపై జన విజ్ఞాన వేదిక కార్యకర్తలకు కూడా పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా 'మండే ఎండల్లో పోవద్దు... వడదెబ్బ బారిన పడొద్దు... ప్రజలారా జాగ్రత్తలు తీసుకోండి' అనే నినాదంతో కూడిన కరపత్రాలు విడుదల చేశారు. ఈకార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ సాకే భాస్కర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు మహమ్మద్ జిలాని, రామిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, తిరుపాలు, లక్ష్మీనారాయణ, ప్రసాదు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మల్లికార్జునప్ప

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఈ వేసవిలో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ నీటి సరఫరా శాఖ జిల్లా అధికారి మల్లికార్జునప్ప తెలిపారు. వేసవి వచ్చిందంటే పలుచోట్ల నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవడం మనం చూస్తూనే ఉంటాం. వేసవిలో బోరు బావులలో నీటిమట్టం అడుగంటి పోవడంతో తాగునీటి కష్టాలు కళ్లారా చూస్తూనే ఉంటాం. పలు గ్రామాల్లో నీటి కోసం సమీప పొలాల్లోని బోరు బావులను ఆశ్రయించడం జరుగుతూఉంటుంది. దీనికి తోడు విద్యుత్ కోతలతో ఆ బోరు బావులలో కూడా నీరు దొరకడం గగనం అవుతుంటుంది. ప్రభుత్వంతో పాటు దాతలు నీటి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తుండడం వేసవిలో చూస్తూనే ఉంటాం. తిరిగి జూన్, జూలై నెలలో వర్షాలు కురిసే వరకు నీటి తిప్పలు తప్పవు. నీరు లేకుంటే మనిషి మనుగడ సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు, నీటి లభ్యత తదితర అంశాలపై జిల్లా గ్రామీణ నీటి సరఫరా జిల్లా అధికారి మల్లికార్జునప్ప ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించారు.

ప్రశ్న : జిల్లాలో తాగునీటి పథకాల వివరాలు తెలపండి.?

జవాబు: జిల్లాలో 7 నియోజకవర్గాలలో 2214 గ్రామాలు ఉన్నాయి. 14,78,417 మంది జనాభా ఉన్నారు. జిల్లాలో సిపిడబ్ల్యుఎస్ పథకాలు (సామూహిక ఉపయోగ రక్షణ నీటి పథకం) 15 ఉన్నాయి. రక్షిత నీటి పథకాలు 3899 ఉన్నాయి. చేతి పంపులు 4033 ఉండగా ఓవర్ హెడ్ స్కీం క్రింద 1249 ట్యాంకులు ఉన్నాయి. గ్రౌండ్ లెవెల్ సర్వీస్ రిజర్వ్ సిస్టంలు 752 ఉన్నాయి.

ప్ర : జిల్లాలో అత్యంత సమస్యాత్మక మండలాలు, సమస్యాత్మక మండలాలు ఎన్ని ఉన్నాయి.?

జ: 2024-25 సంవత్సరానికి గాను జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన మేరకు అత్యంత సమస్యాత్మక మండలాలుగా తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల ఉన్నాయి. సమస్యాత్మక మండలాలుగా 7 ఉన్నాయి. అవి కనగానిపల్లి, ధర్మవరం, ఎన్ పి కుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి ఉన్నాయి. ఈ వేసవి కాలంలో 284 గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉంటుందని గుర్తించాం. ఆయా గ్రామాలకు అవసరమైన నీటిని ట్యాంకర్లతో అందించాల్సి ఉంటుందని అంచనా వేశాం. అలాగే 80 బోరు బావుల లోతు చేయడానికి తగిన ప్రతిపాదనలు పంపాము. నీటి టాంకర్లకు, బోరు బావుల లోతు తీయడానికి రూ.587.32 లక్షలు అవసరమని ప్రభుత్వానికి నివేదించాం. 31 మండలాల్లో గుర్తించిన మేరకు ఈ పనులు చేపట్టడం జరుగుతుంది.

ప్ర : ట్యాంకుల మరమ్మతులు, బోరు బావుల లోతు చేయడం తదితర పనులు ఏయే శాఖల ద్వారా నిర్వహిస్తారు.?

జ: ఈ పనులన్నీ పంచాయతీ రాజ్, సీఈవో, జిల్లా పంచాయతీ శాఖ మండల పరిషత్ గ్రామ పంచాయితీల సమన్వయంతో నిర్వహించడం జరుగుతుంది. చేతి పంపులు, బోరు బావుల మరమ్మతులపై ఫిర్యాదు చేసిన 48 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మండల స్థాయిలో మండల పరిషత్తు కార్యాలయం గ్రామపంచాయతీ స్థాయిలో పంచాయతీ బాధ్యత వహిస్తాయి. అవసరాన్ని బట్టి ఆయా శాఖలు పూర్తిస్థాయిలో పనిచేసి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తతో పని చేస్తున్నాం.

ప్ర : ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ: నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి. ఏదైనా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తితే గ్రామపంచాయతీ సర్పంచి, కార్యదర్శి దృష్టికి తీసుకెళితే వారు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు. అక్కడి సమస్య తీవ్రతను బట్టి సంబంధిత శాఖలు స్పందిస్తాయి. వేసవిలో ఎవరు నీటి కోసం ఆందోళన చెందాల్సిన పనిలేదు. అవసరమైతే నీటి టాంకర్ల ద్వారా నీటిని అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మల్లికార్జునప్ప

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలకు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రామాలయాలతో పాటు పలు దేవాలయాల్లో శ్రీసీతారాముల కళ్యాణం జరిపిం చారు. కొత్తచెరువు రామాలయం, చెరువుగట్టు ఆంజనేయస్వామి దేవాలయం, తేరు రథోత్సవం, బుక్కపట్నంలో నిర్వహిం చిన శ్రీసీతారాముల కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. వారికి ముందుగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారు మాట్లాడుతూ అలనాటి శ్రీరాముని పాలన నేటి ప్రపంచానికి ఆదర్శమని తెలిపారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో శ్రీరాముని పాలన స్ఫూర్తితో సుపరిపాలన సాగుతోందన్నారు. భార్యగా, గృహిణిగా, మాతృమూర్తిగా సీతమ్మ వారు సమాజానికి ఆదర్శం అన్నారు. రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు అన్నదమ్ముల బంధానికి చక్కటి ఉదాహరణ అన్నారు. స్నేహితుడు, నమ్మినబంటు, విశ్వాసపాత్రుడికి నిదర్శనం ఆంజనేయస్వామి అన్నారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్లు శ్రీనివాసులు, రామకృష్ణ, సాలెక్కగారి శ్రీనివాసులు, శివ, నాగేంద్ర, భాస్కర్, బాషా, చింతా మల్లిరెడ్డి, గంగాధర్, బాలు, సుబ్బారెడ్డి, వంశీ, సయ్యద్‌అహ్మద్, లక్ష్మీనారాయణ, వలిపి శ్రీనివాసులు, బండ్లపల్లి రాజు, శ్రీనివాసచౌదరి, శ్రీనాథ్, సమితి చంద్ర, సైకిల్ షాప్ బాబా ఉన్నారు. అలాగే బుక్కపట్నం, ధర్మవరం, గాండ్లపెంట, ముదిగుబ్బ, కదిరి, రొద్దం మండలాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

హిందూపురం : శ్రీ రామ నవమిని పురస్కరించుకొని ఆదివారం హిందూపురం పట్టణంలో పలు ప్రాంతాల్లో రామాలయాల్లో సీతారాముల కళ్యాణోత్సవం జరిగింది. సూగూరు అంజినేయ స్వామి, ముద్దిరెడ్డిపల్లిలోని శ్రీరంగనాథస్వామి, త్యాగరాజ్ నగర్, డిఆర్ కాలనీలో కళ్యాణోత్సవం నిర్వహించారు. సూగూరులో జరిగిన సీతా రాముల కళ్యాణోత్సవంలో మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్, ఆయన సతీమణి రాధతో పాటు టిడిపి నాయకులు, పలువురు కౌన్సిలర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద పానకము, పెసర బ్యాళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీ రామ నవమిని పురష్కరించుకుని ఆదివారం శ్రీ విశ్వనాయక సేవా సమితి కోట వారి ఆధ్వర్యంలో 28వ వార్డు పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ చేశారు.

శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పల్లె రఘునాథరెడ్డి,

పుట్టపర్తి క్రైమ్ : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాలులో అశేష భక్తుల నడుమ వేద పండితులు శ్రీసీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీసీతారా ములకు సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు సీతారాముల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో సీతారాముల ఉత్సవమూర్తులను ఊరేగించారు.

ఉల్లాసంగా ఉట్లమాను పోటీలు

పుట్టపర్తి రూరల్ : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని వెంకటగారిపల్లి గ్రామంలో ఉట్లమాను పోటీలు నిర్వహించగా యువత పెద్ద సంఖ్యలో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. పది మంది యువకులు పోటీపడగా ఉపేంద్ర అత్యంత చాకచక్యంగా ఉట్లమాను ఎక్కి, లక్ష్యాన్ని సాధించారు. దీంతో అతడికి రూ. 10వేల నగదు బహుమతి అందజేశారు.

కదిరి టౌన్ : పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉప ఆలయంగా ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో అధికారులు, పూజారులు ప్రత్యేక పూజలు, నివేదనల అనంతరం శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. సాయంత్రం స్వామివార్లకు ఆస్థాన పుజలు నిర్వహించారు.

రొద్దం : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని ఆర్.మరవపల్లి, రొద్దం గ్రామానికి చెందిన శ్రీరామ్ భక్త మండలి సభ్యులు పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పానకం పంపిణీ చేసి భక్తిని చాటుకొన్నారు. కార్యక్రమంలో సత్యశేఖర్, మధు, బాబు, నరేష్, రంజిత్‌కుమార్, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

రొద్దంలో పానకం పంపిణీ చేస్తున్న శ్రీరామ్ భక్త మండలి సభ్యులు

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు అందరూ పాల్గొని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లాలోని ప్రజలు సమస్యల పరిష్కారానికి ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

9న ధర్మపురిలో విన్సెంట్ ఫెర్రర్ జయంతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని ధర్మపురి గ్రామంలో ఈ నెల 9వ తేదీ జాతీయ స్థాయి సేవా సంస్థ బెంగుళూరు కేంద్రంగా ఉన్న సోమలరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్‌డిటి వ్యవస్థాపకులు, గొప్ప సంఘ సేవకులు విన్సెంట్ ఫెర్రర్ జయంతి సభ నిర్వహిస్తామని డాక్టర్ శివరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా సచివాలయంలో వృద్ధులు, సామాజిక ఆరోగ్య అంశాలపై ఉదయం 9 గంటలకు చర్చా వేదిక నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా యువర్స్ ఫౌండేషన్ చైర్మన్‌ను హాజరవు తారని తెలిపారు. విన్సెంట్ ఫెర్రర్ జీవితం, ఆర్‌డిటి సేవలు, ఆత్మకథ శైలిలో ఏకపాత్రాభినయం నాటిక ఉంటుందన్నారు. సౌత్ ఇండియా ఎన్జీవో కోఆర్డినేటర్ సత్య నిర్ధారణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ప్రోగ్రాం కన్వీనర్ శ్రీధర్ తెలిపారు. ఆసక్తి కలిగిన స్వచ్ఛంధ సంస్థలు పాల్గొన వచ్చున్నారు. మరిన్ని వివరాలకు ప్రణాళిక రూపకర్త సత్య నిర్ధారణ్ 99495 63440లో సంప్రదించాలన్నారు.

వార్డు సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదివారం పట్టణంలోని 40వ వార్డు గూడ్స్‌షెడ్ కొట్టాలు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ ఆధ్వర్యంలో కాలనీ వాసులు పలు సమస్యలపై మంత్రికి వినతి పత్రం సమర్పించారు. జెవి.రమణ మాట్లాడుతూ గూడ్స్‌షెడ్ కొట్టాలులో దాదాపు 400 కుటుంబాలు నివాసం ఉంటున్నా యన్నారు. కాలనీలో రహదారులు, సైడ్ కాలువలు పూర్తిగా పాడైపోయాయని మరమ్మతులు చేపట్టాల ని కోరారు. అలాగే కాలనీలో ఉంటున్న నిరుపేదలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

'కెఎల్‌ఎన్'లో 9 నుంచి ఉచిత కోచింగ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని కెఎల్‌ఎన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈ నెల 9 నుంచి ఎపిఆర్‌జెసి, ఆర్‌డిటి, పాలిసెట్, బ్రిడ్జి కోర్సులకు సంబంధించి అత్యంత అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. కదిరి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల విద్యార్థులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఇనిస్టిట్యూట్‌లో సంప్రదించాలన్నారు.

ఎద్దుల యజమానులకు ట్రోఫీ, నగదు అందజేస్తున్న మంత్రి సవిత, నిర్వాహకులు

అట్టహాసంగా రాతిదూలం లాగుడు పోటీలు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని మరువ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో ఎద్దులతో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత హాజరై పోటీలను తిలకించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దుల యజమాని రామాంజనేయులుకు రూ. 25 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన సిరప్పస్వామికి రూ. 15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నాగరాజు రూ. 10వేల నగదు బహుమతిని మంత్రి సవిత అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పల్లెల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఎద్దుల బండ్ల పోటీలు, రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఇలాంటి పోటీలను అందరూ ఆదరించాలన్నారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయ ముఖద్వారం వద్ద ఉట్ల పరస నిర్వహించారు. కార్యక్రమాల్లో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు నిమ్మల శ్రీధర్, బాలకృష్ణచౌదరి, జయరామ్, వేణు రాయల్, రాజారెడ్డి, నాగేనాయక్, అజ్మతుల్లా, గిరిధర్‌గౌడ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముఖ్యఅతిథులు

ఎఫ్‌విఎఫ్-బిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎడిసిఎ ఆధ్వర్యంలో జరిగే ఎఫ్‌విఎఫ్-బిపిఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. స్థానిక ఆర్‌డిటి క్రీడా మైదానంలో ఆదివారం ఆర్‌డిటి ఆర్‌డి ప్రమీల, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్, ధర్మవరం, బత్తలపల్లి సిఐలు నాగేంద్ర, ప్రభాకర్ హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడా పోటీలు క్రీడా స్ఫూర్తిని నిలబెడతాయన్నారు. ప్రతి క్రీడాకారుడు ఉత్తమ క్రీడను ఆడటం అలవాటు చేసుకోవాలన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో పోటీతత్వం ఉండాలే కాని, శత్రుత్వం పెంచుకోకూడద న్నారు. స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు జరగాలన్నారు. ఈ పోటీలు ఈ నెల 6వ తేదీ ప్రారంభమై ఏప్రిల్ 13వ తేదీ బత్తలపల్లి ఆర్‌డిటి మైదానంలో ముగుస్తాయన్నారు. ఈ పోటీల్లో టీమ్ అన్నే, టీమ్ మ్యాంచో, టీమ్ విషా, టీమ్ విన్సెంట్, ఎంవిఎం ఆర్‌డిటి టీంలు పాల్గొంటాయన్నారు. అనంతరం ముఖ్యఅతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో బోయపాటి అప్పస్వామి, క్రికెట్ కోచ్ జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

పావగడలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి-పావగడ

పావగడ పట్టణంతో పాటు తాలూకా వ్యాప్తంగా ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక సంతాన వేణుగోపాలస్వామి, సంకాపూర్‌లోని సువర్చలాదేవి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. నిడ్గల్ హోబలిలోని రామయ్యపాళ్యం రామాలయంలో రామ, లక్ష్మణ, సీత, ఆంజనేయ మూలవిగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు పిండి, పూలు, తమలపాకులతో తయారు చేసిన జ్యోతులను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి సమర్పించారు. నాగలమడక హుబ్లీ, వైఎన్.హొసకోట, కసబా హుబ్లీ సహా తాలూకాలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రీరామనవమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం పూజా మందిరాల దగ్గర పెసరుబ్యాళ్లు, పానకం పంపిణీ చేశారు.

రామయ్యపాళ్యంలో జ్యోతుల మోస్తున్న మహిళలు

ముగిసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-పరిగి

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, క్రమశిక్షణ, స్వయం కృషి, వ్యక్తిగత స్వాతంత్ర్యం, సహజీవనం, తదితర మంచి లక్షణాలు పెంపొందించి భావి భారత పౌరులుగా మార్చడానికి అవసరమైన 5 రోజుల శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. మండలంలోని శ్రీవిద్యానిధి కళాశాల ఆవరణలో ఈ నెల 2వ తేదీ ప్రారంభమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరం ఆదివారం సర్వ ధర్మ ప్రార్థనతో ముగిసింది. ముఖ్య అతిథిగా చిలమత్తూరు ఎంఇఒ సల్మాన్ రాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి శ్రీసత్యసాయి జిల్లాలో పిఎంశ్రీ ఫేజ్ -1 కింద 24 పాఠశాలల నుంచి 76 మంది గైడ్స్(బాలికలు), 88 మంది స్కౌట్స్(బాలికలు), స్కౌట్స్ మాస్టర్లు, గైడ్స్ కెప్టెన్లు హాజరయ్యారు. ఆపద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ ముడులు, టెంట్ వేయడం, ప్రతికూల పరిస్థితుల్లో సర్దుబాటు చేసుకొని జీవించగలగడం, సూర్య నమస్కారాలు, తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. జిల్లా కార్యదర్శి ఎన్.గిరిధర్ పర్యవేక్షణలో స్కౌట్స్‌కు, జిల్లా విద్యార్థి శిక్షణ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో గైడ్స్‌కు, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు వివిధ కార్యవర్గ సభ్యులచే శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన శ్రీవిద్యానిధి కళాశాల కరస్పాండెంట్ ఎల్లారెడ్డికి జిల్లా శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ శిబిరానికి ట్రెజరర్ ఫణిభూషణ్‌రావు, రామకృష్ణ, వెంకటరామప్ప, నారాయణ స్వామి, రంగనాథ్‌రాజు, అశ్వర్థనారాయణ, సతీష్, ప్రసన్న మేడం, ఎఎస్ ఒసి నాగరాజు శిక్షకులుగా పని చేశారు.

శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

డ్రైవర్లందరూ బీమా తీసుకోవాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

డ్రైవర్లపై జరుగుతున్న దాడులను కలిసికట్టుగా వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆల్ డ్రైవర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటశివ, మండల అధ్యక్షులు చిరంజీవి పేర్కొన్నారు. ఓడిసిలో ఆదివారం డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ప్రమాదా బీమా తీసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో కుటుంబానికి ఆసరా ఉంటుందన్నారు. డ్రైవర్ల అభివృద్ధి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండలంలోని డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాగార్జునను సన్మానిస్తున్న నాయకులు

మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాగార్జునకు సన్మానం

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన కొంకా పోతలయ్య కుమారుడు తాడిమర్రి మండలం బిజెవైఎం అధ్యక్షులు కొంకా నాగార్జున ధర్మవరం మార్కెట్ యార్డ్ నూతన డైరెక్టర్‌గా నియమితులయ్యారు. దీంతో కొంకా నాగార్జున మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన బాధ్యతలను అంతఃకరణ శుద్ధితో నెరవేరుస్తానని తెలిపారు. నూతన మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంనా నాగార్జునను మండల బిజెపి, కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దేవర రాము, ఆరవేటి ఆనంద్, బిల్లే చంద్ర, ఆరవేటి నారాయణస్వామి, ఏటుకూరి నాయుడు, పోతలయ్య, కత్తి నాగభూషణం, బ్యాళ్ల చిన్న పార్థసారథి, గోపాల్‌రెడ్డి, అనుగుత్తి రమణ, గొంగటి రమేష్, నాగరాజు, పెద్దన్న, అంజి, శివంపల్లి ఆరవేటి గంగాధర్, సదాశివుడు, రామంజి, నారాయణస్వామి, సుధాకర్, మంజునాథ్, కొండయ్య పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి-హిందూపురం

ఎక్సైజ్ పోలీసులు ఆదివారం పట్టణంలోని పలుప్రాంతాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. సిఐ లక్ష్మి దుర్గయ్య ఆధ్వర్యంలో తూమకుంట పారిశ్రామి వాడలో జరిగిన దాడుల్లో సమోద్ కుమార్, లేపాక్షి మండలం సి. వెంకటాపురానికి చెందిన రామాచారి, అలాగే లేపాక్షి మండలం సిరివరం పి. తిప్పన్న, రామలక్ష్మి, గలిబిపల్లి,పట్టణంలోని మేళాపురానికి చెందిన లక్ష్మిపై కేసులు నమోదు చేసి వారి వద్ద ఉన్న కర్నాటక మద్యాన్ని, కల్లును సీజ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఐలు పథ్వీ, ఫరూక్, సిబ్బంది నరసింహ, వెంకటేష్, అంజి, రవీంద్ర, సురేష్, కుమార్, రంగదామా, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న మద్యం, కల్లును చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

శ్రీయోగి వేమన ఆలయం వద్ద ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని కటారుపల్లి గ్రామంలో వెలసిన శ్రీయోగివేమన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో, వేమన సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ పీఠాధిపతి తుంగనంద వేమారెడ్డి తెలిపారు. పీఠాధిపతి మాట్లాడుతూ నవధాన్యాలతో వండిన కుంభాన్ని ఆలయం ఎదుట రాసి పోసి కుంభాభిషేకం చేసి ఆ నవధాన్యాలు వచ్చిన భక్తులు తీసుకెళ్తరని ఆయన తెలిపారు వచ్చిన భక్తులకు తాగునీరు, వైద్యం, అన్న దాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులను ఆకట్టుకునేలా నృత్య కళాకారులతో కూచిపూడ నృత్యం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి పర్యవేక్షణలో కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, ఇన్‌ఛార్జి ఎస్ఐ వలిబాషా, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

తిరుణాళ్లు ప్రారంభం

నల్లచెరువు : వేమన తిరుణాల ఆదివారం రాత్రి ప్రారంభమై 12వ తేదీ ముగుస్తుంది. తిరుణాలకు వచ్చిన భక్తులకు ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. నల్లచెరువు మేజర్ పంచాయతీ సర్పంచి పంచరత్నం ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసినట్లు కండక్టర్ ఉత్తన్న తెలిపారు. తిరుణాల జరిగే ప్రతిరోజు అన్నదానం ఉంటుంది. తిరుణాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మక్బూల్ బాషా తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో వేమన విగ్రహం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిఐ శివరాముడు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల కేంద్రమైన ముదిగుబ్బలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆదివారం సిఐ శివరాముడు ప్రారంభించారు. సిఐ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో స్టూడియో ఓనర్లు, ఔట్ డోర్ ఫొటోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఆత్మకూరు : ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, మండల ఇన్‌ఛార్జి బాలాజీ సహకారంతో ఆదివారం మండల పరిధిలోని బి.యాలేరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. టోర్నమెంట్‌ను టిడిపిరాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరశురాం ప్రథమ బహుమతి రూ.30వేలు, కర్రి ఆవుల పెద్దన్న రూ.10వేలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు అవిలిగొండ మధు, ఈడిగ శివ, బోయ దాసరి అనిల్‌కుమార్, కర్రి ఆవుల పెద్దన్న, జెడ్పీహెచ్‌ఎస్ ఎస్‌ఎంసి చైర్మన్ నాగరాజు, జోగి లక్ష్మీనారాయణ, రమేష్, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గౌనివారిపల్లి జట్టు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా గౌనివారిపల్లి జట్టు నిలిచింది. మండలంలోని బుచ్చిరాజుపల్లి, మద్దకవారిపల్లి గ్రామాల్లో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో దాదాపు 30 జట్లు పాల్గొన్నాయి. శ్రీరామనవమి పండుగ రోజు నిర్వహించిన ఫైనల్ పోరులో బుచ్చిరాజుపల్లి, గౌనివారిపల్లి జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన బుచ్చిరాజుపల్లి జట్టు 11 ఓవర్లకు 65 పరుగులు చేయగా, గౌనివారిపల్లి జట్టు 11 ఓవర్లకు 66 పరుగులు చేసి టోర్నమెంట్ విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు ఎస్ఐ బి.మల్లికార్జునరెడ్డి ట్రోఫీ అందజేశారు.

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

పండగ పూట విషాదం.. ఆలయంపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీరామనవమి పండగ వేళ మండలంలో విషాదం చోటు చేసుకుంది. రామాలయంపైన ముందు భాగంలో ఉన్న శ్రీరాముడు విగ్రహానికి పూలమాల వేసేందుకు వెళ్లి పై నుంచి కాలు జారి కింద పడటంతో మండలంలోని కనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(36) ఆదివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. శ్రీరాముడు విగ్రహానికి పూలమాల వేసేందుకు ఆలయంపైకి ఎక్కిన లక్ష్మీనారాయణ ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

కదిరి-రాయచోటి ప్రధాన రహదారిపై గాండ్లపెంట సమీపంలోని చర్చి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నంబులపూలకుంట మండలంలోని ధనియాన్ చెరువు గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై కదిరి నుంచి స్వగ్రామం వెళుతుండగా మేకలచెరువు వైపు నుంచి అతివేగంగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో మోహన్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 సాయంతో కదిరి ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి సపర్యలు చేస్తున్న స్థానికులు

మూడు ఆవులు మృతి..

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక పాతఊరుకు చెందిన రైతు జల్లిపల్లి రాజుకు చెందిన ఐదు ఆవులు ఆదివారం అస్వస్థత గురవడంతో పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. దీంతో డాక్టర్ హుటాహుటిన అక్కడికి చేరుకొని వైద్య పరీక్షలు చేయగా అప్పటికే మూడు ఆవులు మృతిచెందాయి. మరో రెండు ఆవులకు ఆక్సిజన్ ద్వారా చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. పశు వైద్యాధికారి రామేశ్వరరావు మాట్లాడుతూ ఆవులు గడ్డి మేసి నీరు తాగిన అనంతరం కడుపు ఉబ్బి మృతిచెందాయన్నారు. వాటికి పోస్ట్‌మార్టం నిర్వహించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

మృతి చెందిన ఆవులను పరిశీలిస్తున్న వైద్యులు